ప్రజాశక్తి

మంగళవారం 20 మే 2025 | 5 | అనంతపురం

డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో 21న మోడల్ డీఎస్సీ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

పోస్టర్లు విడుదల చేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

భారత ప్రజాతంత్ర యువజన సంఘం (డివైఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఈనెల 21న మోడల్ డీఎస్సీ నిర్వహించనున్నట్లు డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బాలకృష్ణ, కసాపురం రమేష్ తెలిపారు. సోమవారం నగరంలోని 2వరోడ్డు పార్క్‌లో డీఎస్సీ అభ్యర్థులతో కలిసి మోడల్ డీఎస్సీ పరీక్ష పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రముఖ విద్యావేత్త, మాజీ ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు పర్యవేక్షణలో ఈనెల 21న కోచింగ్ సెంటర్లలో, సెల్ఫ్ సెంటర్స్‌లో మోడల్ డీఎస్సీ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలను అభ్యర్థులందరూ ఉపయోగించుకొని తమ ప్రతిభను కనపరిచి ఉపాధ్యాయులుగా ఎంపిక కావాలని డివైఎఫ్ఐ తరుపున ఆకాంక్షించారు. ఇతర వివరాలకు సెల్.. 99085 04321, 96180 62490 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

పుచ్చలపల్లి సుందరయ్యకు గుంతకల్లులో నివాళులు అర్పిస్తున్న సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు

ఆదర్శం.. సుందరయ్య జీవితం..!

జిల్లా వ్యాప్తంగా ఘనంగా వర్ధంతి కార్యక్రమాలు

మహానేత పుచ్చలపల్లి సుందరయ్య జీవితం మొత్తం నేటి తరానికి ఎంతో ఆదర్శనీయం అని సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు కొనియాడారు. సమసమాజ దార్శనీకుడు, కష్టజీవులు, శ్రమ జీవుల పెన్నిధి, మెట్టమొదటి పార్లమెంట్ ప్రతిపక్ష నేత, దక్షణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి కార్యక్రమాలను సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా సోమవారం నాడు ఘనంగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాలులు అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాల్లో సుందరయ్య ప్రజా పోరాటాలను నాయకులు వివరించారు. చిన్న వయస్సులోనే బ్రిటీష్‌వారిని వ్యతిరేకించి, ఆంధ్రరాష్ట్రంలో ఉప్పు సత్యగ్రహానికి నాయత్వం వహించిన నేత సుందరయ్య అన్నారు. వ్యక్తిగత ఆస్తిని ప్రజలకు పంచి పెట్టిన త్యాగమూర్తి అన్నారు. సాధారణ వ్యక్తిగా పార్లమెంట్‌కు సైకిల్‌పై వెళ్లిన ఆదర్శనేత పుచ్చలపల్లి సుందరయ్య అని కొనియాడారు. అందరూ సమానం అంటూ కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాటం చేశారన్నారు. పార్లమెంటేరియన్‌గా, పోరాట యోధుడిగా ఆయన జీవితం స్ఫూర్తిగా తీసుకుని సోషలిజం సాధించే కృషిలో సిపిఎం నాయకులు, కార్యకర్తలు పట్టుదలగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

వార్త 6లో

టిడిపి ఖాతాలోకి కదిరి మున్సిపాల్టీ

◆ గాండ్లపెంట ఎంపిపిని సొంతం చేసుకున్న అధికార పార్టీ ◆ మరోసారి వాయిదా పడిన రామగిరి ఎన్నిక

చైర్‌పర్సన్... దిల్షాదున్నిసా

వైస్‌చైర్మన్..రాజశేఖర ఆచారి

వైస్ చైర్మన్ సుధారాణి

ప్రజాశక్తి-కదిరి టౌన్,గాండ్లపెంట

వివిధ కారాణాలతో ఖాళీగా ఉన్న మున్సిపల్ ఛైర్మన్, ఎంపిపి స్థానాలకు సంబంధించి అధికారులు సోమవారం నాడు ఎన్నికను నిర్వహించారు. ఇందులో భాగంగా శ్రీ సత్యసాయి జిల్లాలో కదిరి మున్సిపల్ ఛైర్మన్, గాండ్లపెంట, రామగిరి ఎంపిపి ఎన్నికను సోమవారం నిర్వహించారు. ఇందులో కదిరి మున్సిపాల్టీ, గాండ్లపెంట ఎంపిపి పదవులను టిడిపి కైవసం చేసింది. కదిరి మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా దిల్షాద్ ఉన్నీసా ఎన్నిక అయ్యారు. గాండ్లపెంట ఎంపిపిగా గజ్జల సోమశేఖర్‌రెడ్డి ఎన్నిక అయ్యారు. మరోసారి రామగిరి ఎంపిపి ఎన్నిక వాయిదా పడింది. కోరంలేకపోవడంతో ఈ ఎన్నికను వాయిదా వేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. కాగా రామగిరి ఎన్నిక ఇప్పటికే రెండు సార్లు వాయిదా పడింది. ప్రస్తుతం మూడవ సారి కూడా వాయిదా పడడం గమనార్హం.

కదిరి మున్సిపాల్టీ టిడిపి కైవసం
ఛైర్‌పర్సన్‌గా దిల్షాదున్నిషా,
వైస్‌ఛైర్మన్లుగా రాజశేఖర ఆచారి, సుధారాణి

కదిరి టౌన్ : కదిరి మున్సిపాలిటీని అధికార తెలుగుదేశం పార్టీ కైవసం చేసుకుంది. టిడిపి మద్దతుదారులు ఛైర్‌పర్సన్‌తో పాటు వైస్‌ఛైర్మన్లగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం ఉదయం 11 గంటలకు కదిరి మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో ఎన్నికల అధికారి, ఆర్డీవో వివిఎస్.శర్మ అధ్యక్షతన ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికను నిర్వహించారు. ఎన్నిక నేపథ్యంలో బెంగళూరు క్యాంపు నుంచి కౌన్సిలర్లు ప్రత్యేక బస్సుల్లో కదిరి మున్సిపాల్టీకి ఉదయం 11 గంటలకు చేరుకున్నారు. ఆర్డీవో వివిఎస్.శర్మ అధ్యక్షతన ఎన్నిక కార్యక్రమాన్ని నిర్వహించారు. కదిరి మున్సిపాలిటీలో 36 మంది సభ్యులు ఉండగా 25 మంది టిడిపి కౌన్సిలర్లు టిడిపి మద్దతుదారులకు ఓటు వేశారు. దీంతో ఛైర్‌పర్సన్‌గా 10వ వార్డు కౌన్సిలర్ దిల్షాదున్నిషా, వైస్‌ఛైర్మన్లుగా 19వ వార్డు కౌన్సిలర్ రాజశేఖర ఆచారి, 21వ వార్డు కౌన్సిలర్ సుధారాణిలు ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు. ఎన్నికైన వీరికి ఎన్నికల అధికారి ధృవీకరణ పత్రాలను అందజేశారు. అనంతరం వారితో ప్రమాణస్వీకారం చేయించారు. ఛైర్మన్, వైస్ ఛైర్మన్ల ఎన్నికకు వైసిపి కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. కదిరి మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా కదిరి డీఎస్పీ శివ నారాయణ స్వామి ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక కార్యక్రమంలో పాల్గొన్న కౌన్సిలర్లు

ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్న నూతన ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్మన్లు

ఎమ్మెల్యే కందికుంటకు కృతజ్ఞతలు

ఛైర్మన్, వైస్ ఛైర్మన్లుగా ఎన్నికైన అనంతరం ఛైర్‌పర్సన్ దిల్షాదున్నీషా, వైస్ ఛైర్మన్ రాజశేఖర్ ఆచారి, సుధారాణిలు కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌ను ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. టిడిపి నేతలు బహుద్దీన్, బాబయ్యలతో కలిసి ఎమ్మెల్యేను కలిసి పూలబొకేలు అందించారు. తమపై నమ్మకంతో పదువులు ఇచ్చిన ఎమ్మెల్యేకు రుణపడి ఉంటామన్నారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ పట్టణాభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

గాండ్లపెంట ఎంపిపి టిడిపి వశం | ఎంపీపీగా సోమశేఖర్ రెడ్డి

గాండ్లపెంట : గాండ్లపెంట ఎంపీపీ టిడిపి ఖాతాలోకి వెళ్లింది. సోమవారం నిర్వహించిన ఎన్నికలో జి.సోమశేఖర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల అధికారి విజయప్రసాద్ ఆధ్వర్యంలో ఎంపీపీ ఎన్నికను నిర్వహించారు. తెలుగుదేశం పార్టీకి చెందిన నలుగురు ఎంపిటిసిలు హాజరయ్యారు. వైసిపికి చెందిన ముగ్గురు ఎంపిటిసిలు గైర్హాజరయ్యారు. కోరం ఉండటంతో ఎన్నికను అధికారులు నిర్వహించారు. ఎంపిపి అభ్యర్థిగా సోమశేఖర్‌రెడ్డిని ఎంపీటీసీ జయ రామకృష్ణారెడ్డి ప్రతిపాదించగా మరో ఎంపిటిసి భారతి బలపరచారు. పోటీ లేకపోవడంతో ఎంపీపీగా జి.సోమశేఖర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు. అనంతరం ఆయనకు డిక్లరేషన్ పత్రాన్ని అధికారులు అందించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బి.బాబురావు, ఎంపీడీవో వెంకటరామిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ ఎన్.అమీర్‌బాషా, ఆర్ఐ అశోక చక్రవర్తి, ఎంపీటీసీ గంగోజమ్మ పాల్గొన్నారు.

ఎంపిపి... సోమశేఖర్‌రెడ్డి

రామగిరి ఎంపీపీ ఎన్నిక మళ్లీ వాయిదా

రామగిరిలో ఎంపిపి ఎన్నిక మరోసారి వాయిదా పడింది. ఎంపిటిసిల గైర్హాజరుతో కోరం లేక సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఎంపిపి ఎన్నికకు సంబంధించి అధికారులు సోమవారం నాడు మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎన్నిక కార్యక్రమానికి ముగ్గురు ఎంపిటిసిలు మాత్రమే హాజరయ్యారు. తగినంత మంది ఎంపిటిసిలు రాకపోవడంతో అధికారులు ఎన్నికను నిర్వహించలేకపోయారు. ఈ నేపథ్యంలో ఎన్నికను వాయిదా వేస్తున్నట్లు ఎన్నికల అధికారి సంజీవయ్య తెలిపారు. కాగా ఇప్పటికే రామగిరి ఎంపిపి ఎన్నిక రెండు సార్లు వాయిదా పడింది. మూడవ సారికూడా వాయిదా పడడంతో ఈ ఎన్నిక ఎప్పటికి పూర్తవుతుందోనని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. సమస్యాత్మక ప్రాంతం కావడం, గత ఘటనలను దృష్టిలో ఉంచుకుని పోలీసులు రామగిరిలో ఉదయం నుంచి భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

అర్జీల పరిష్కారంపై దృష్టి

కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్

అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో సోమవారం నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, డిఆర్ఒ ఎ.మాలోల, ఫారెస్ట్ సెటిల్మెంట్ ఆఫీసర్ జి.రామకృష్ణారెడ్డి, డిప్యూటీ కలెక్టర్లు రామ్మోహన్, తిప్పేనాయక్, ఆనంద్, వ్యవసాయ శాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి ప్రజల నుంచి 460 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు అందించే అర్జీలకు ఎప్పటికప్పుడు పరిష్కారం చూపాలన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం సాధారణ బదిలీలపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేసి, సాధారణ బదిలీలు చేపట్టాలని ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో ఆ ఉత్తర్వుల్లోని నిబంధనలను అనుసరించి మాత్రమే అధికారులు తమ పరిధిలోని ఉద్యోగులను బదిలీ చేయాల్సి ఉంటుందన్నారు. వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో నిరుపయోగంగా ఉన్న కాలం చెల్లిన వాహనాలను నిబంధనలను అనుసరించి వేలం వేయాలని అధికారులను ఆదేశించారు. వేలం వేసిన అనంతరం సంబంధిత రికార్డుల్లో వివరాలను పొందుపరచి, ఆ రికార్డుల నుంచి వాటిని తొలగించాలన్నారు. ఈ ప్రక్రియను జూన్ 20వ తేదీ లోపు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో రామచంద్రరెడ్డి, డిపిఒ నాగరాజు నాయుడుతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యను పరిష్కరించండి : సిపిఎం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం రూరల్ మండల పరిధిలోని ప్రజాశక్తి కాలనీలో నెలకొన్న విద్యుత్ సమస్యను తక్షణమే పరిష్కరించాలని సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కక్కల పల్లి సబ్ స్టేషన్ దగ్గర సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి రామిరెడ్డి మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా ప్రజాశక్తి కాలనీలో విద్యుత్ సమస్య సమస్యను పరిష్కరించాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్న ఫలితం లేదని తెలిపారు. ఈ నెల 15వ తేదీ కురిసిన భారీ వర్షానికి కాలనీ నీట మునిగిన సందర్భంలో ప్రతి ఇంటికి విద్యుత్తు ప్రవహించి స్థానికులకు కరెంట్ షాక్ తగిలిందన్నారు. ప్రాణాపాయం తప్పిందని, అయితే ప్రజలకు ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని తెలిపారు. విద్యుత్ అధికారులకు, సిబ్బందికి కాలనీవాసులు ఫోన్ చేసిన స్పందించడం లేదన్నారు. కార్యాలయాల వద్దకు వెళితే చులకనగా మాట్లాడే పరిస్థితి విద్యుత్ అధికారుల నుంచి ఎదురౌతుండం బాధిస్తోందన్నారు. ప్రజాశక్తి కాలనీలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మార్చాలని, అర్థ్ సమస్యలు పరిష్కరించాలని, కొత్త లైన్లు వేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ఏఈ సోమశేఖర్ మాట్లాడుతూ ఆర్థ్ వైర్లను ఇప్పుడే బిగిస్తామని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు ఈ సాయంకాలానికి మారుస్తామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర నాయకులు వెంకటనారాయణ, ఇర్ఫాన్, మసూద్, లతీఫ్, రాజు, గఫూర్, రామంజి, కాలనీ శాఖ కార్యదర్శి శ్రీనివాసులు, గోపాల్, అల్లా ప్రకాష్, వార్డ్ మెంబర్ ఆదెమ్మ, ఆటో ప్రసాద్, ఖాదర్, కుల్లాయమ్మ, కక్కల పల్లి గ్రామ వాసులు బండి నరసింహులు, ఇస్మాయిల్, బసమ్మ, అనసూయమ్మ, పర్వీన, హైదర్ వలీ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

కార్యకర్తలకు అండగా ఉంటాం : ప్రభుత్వ విప్

ప్రజాశక్తి-రాయదుర్గం

మినీమహానాడులో ప్రసంగిస్తున్న ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు

టిడిపి నాయకులు, కార్యకర్తలను ఎప్పటికీ గుర్తుంచుకుంటామని, వారికి అండగా ఉంటామని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు భరోసా ఇచ్చారు. పట్టణంలోని సీతారామాంజనేయ సత్రం వద్ద సోమవారం నిర్వహించిన టిడిపి మినీ మహానాడుకు కాలవ సారథ్యం వహించారు. ముందుగా పహల్గాంలో ఉగ్రదాడిలో మృతిచెందిన పౌరులు, పాకిస్తాన్ కాల్పుల్లో అమరులైన సైనికు లకు వందనం తెలుపుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం కాలవ మాట్లాడుతూ ఐదేళ్ల వైసిపి అరాచక పాలనలో పార్టీ శ్రేణులను తీవ్ర ఇబ్బందులు పెట్టినా బెదరక పార్టీ కోసం పని చేశారని, వారికి ఎప్పుడూ అండగా ఉంటామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు, మద్దతుదారుల గెలుపుకకు కషి చేయాలన్నారు. కార్యకర్తల సంక్షేమ నిధి ఏర్పాటు చేసి, ఆపదలో ఉన్న కార్యకర్తలను ఆదుకుంటామన్నారు. 75 మంది అనాథలను చదివిస్తామన్నారు. అభివృద్ధి పనులపై ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్ మాట్లాడుతూ వైసిపి పాలనలో జగన్ కేవలం సాధింపు చర్యలు చేపట్టారన్నారు. అనంతరం పార్టీ కోసం పని చేసి కేసులు ఎదుర్కొన్న ఐదుగురు కార్యకర్తలకు రూ. 50 వేల చొప్పు నగదు అందజేసి సత్కరించారు. అంతకుముందు పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సమావేశంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు నాగరాజు, మండల కన్వీనర్లు హనుమంతురెడ్డి, గిరి మల్లప్ప, నాయకులు మోహన్‌రెడ్డి, సంపత్ కుమారి, రమేష్, మురళి, ఉస్మాన్, పురుషోత్తం పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా తిరంగా ర్యాలీ

రాయదుర్గంలో నిర్వహించిన తిరంగా ర్యాలీలో పాల్గొన్న ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, తదితరులు

ప్రజాశక్తి-రాయదుర్గం

ఉగ్రవాదంపై భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావడంతో సైన్యానికి మద్దతుగా సోమవారం సాయంత్రం పట్టణంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో 300 మీటర్ల పొడవైన జాతీయ జెండాను ప్రదర్శిస్తూ ఎన్టీఆర్ కూడలి నుంచి బళ్లారి రోడ్డు, వినాయక కూడలి మీదుగా గాంధీ విగ్రహం వరకూ వెళ్లారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ భారత త్రివిధ దళాలకు వందనం తెలుపుతూ ఈ ర్యాలీ చేపట్టినట్లు తెలిపారు. ప్రజలు ప్రభుత్వానికి ఎప్పుడూ అండగా ఉంటారన్నారు. అనంతరం ఐదుగురు మాజీ సైనికులను సత్కరించారు. గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాలు శిల్ప, మున్సిపల్ కమిషనర్ దివాకర్ రెడ్డి, టిడిపి జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మంజునాథ్ గౌడ్, బిజెపి నాయకులు అంబాజీరావు, వసుంధర, కౌన్సిలర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బొమ్మనహాల్ : ఉగ్రవాదంపై భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావడంతో సైన్యానికి మద్దతుగా సోమవారం బొమ్మనహాల్‌లో తిరంగా ర్యాలీ చేపట్టారు. తహశీల్దార్ మునివేలు, జమేదారు, పోలీ సులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, ప్రజలు జాతీయజెండాలు చేతబూని స్థానిక మండల రెవెన్యూ కార్యాలయం నుంచి పోలీస్ స్టేషన్ వరకూ ర్యాలీ నిర్వహించారు. తహశీల్దార్ మాట్లాడుతూ దేశ రక్షణలో భాగంగా భారత సైనికులు ప్రాణాలను పణంగా పెడుతున్నారన్నారు. దీంతో సైన్యానికి మద్దతు పలకడానికి ఈ ర్యాలీ నిర్వహించామన్నారు.

దుకాణాల వద్ద చెత్త ఉంటే జరిమానా

నేటి నుంచి అమలు : కమిషనర్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలోని దుకాణ సముదాయాలు ముందు చెత్త కనిపిస్తే జరిమానా విధిస్తామని కమిషనర్ బాలస్వామి సోమవారం ఒక ప్రకటనలో ఆదేశాలు జారీ చేశారు. నగరంలోని వ్యాపారులు వారి దుకాణాల్లోని వ్యర్థాలను పారవేయరదన్నారు. అలా పారవేయడం వల్ల నగరంలో అపరిశుభ్రత నెలకొంటోందన్నారు. అలా చెత్తను పారవేయకూడదని ఇప్పటికే పలుమార్లు దుకాణాల యజమానులకు రాతపూర్వకంగా తెలియజేసినప్పటికీ ఎలాంటి మార్పు రాలేదన్నారు. కావున మంగళవారం నుండి ఎవరి దుకాణం ముందు వారు చెత్త బుట్టలు ఏర్పాటు చేసుకుని చెత్తను వేసుకోవాలన్నారు. లేకుంటే అపరాద రుసుం విధిస్తామని హెచ్చరించారు.

మయూర వాహనంపై ప్రసన్నవెంకటరమణస్వామి

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలో వెలసిన శ్రీప్రసన్న వెంకటరమణ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం స్వామివారు మయూర వాహనంపై ఆశీనులై భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

మయూర వాహనంపై ఊరేగుతున్న వెంకటరమణస్వామి

నర్సింగ్ విద్యార్థినికి చేయూత

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

నియోజకవర్గంలోని ఓ మారుమూల గ్రామానికి నిరుపేద విద్యార్థినికి సోమవారం ఇన్ఫినిటీ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ బద్దేనాయక్ చేయూతనందించారు. విద్యార్థిని అనంతపురం నగరంలోని ఆదర్శ నర్సింగ్ కళాశాలలో జిఎన్ఎం ద్వితీయ సంవత్సరం చదువుతోంది. విద్యార్థిని తండ్రి అనారోగ్యం తో మృతిచెందాడు. తల్లి కూలి పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషిస్తోంది. విద్యార్థినికి చదువుపై ఆసక్తి ఉన్నా ఫీజు కట్టలేని పరిస్థితుల్లో ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న బద్దేనాయక్, ట్రస్ట్ సభ్యులు ఆ విద్యార్థిని చదువుతున్న కళాశాలకు వెళ్లి ప్రిన్సిపల్ యామినిని సంప్రదించి ఫీజు రూ. 25వేలు చెల్లించారు. అలాగే విద్యార్థిని కోర్సు పూర్తయ్యేంత వరకు ఫీజులన్నీ భరిస్తానని బద్దేనాయక్ ప్రిన్సిపల్‌కు తెలిపారు. ఆయన వెంట ట్రస్ట్ వైస్ ఛైర్మన్ సురేష్‌కుమార్, తిప్పేస్వామి, రాము, చిరంజీవి ఉన్నారు.

రైతులను ఆదుకోవాలని వినతి

బొమ్మనహాల్ : అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ తహశీల్దార్ ముని వేలుకు వినతిపత్రం అందజేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. రైతులు మాట్లాడుతూ మండలంలో సుమారు వెయ్యి ఎకరాల్లో పత్తి పంట సాగు చేశారన్నారు. అకాల వర్షాలకు కాపు దశలో పూత రాలిపోవడం, పత్తి పంట నీట మునిగిపోవడంతో తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు గ్రామాల్లో పర్యటించి పంట నష్టాలను అంచనా వేసి కలెక్టర్‌కు నివేదిక పంపాలని రైతులు కోరారు.

'పుచ్చలపల్లి' ఆశయాలను కొనసాగిద్దాం

సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

పేదల కోసం నిత్యం పోరాటాలు చేసిన కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలను కొనసాగిద్దామని సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప పిలుపునిచ్చారు. ఆదివారం పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతిని పురస్కరించుకుని సిపిఎం మండల కమిటీ, ఎపి గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మండల కేంద్రంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం నుంచి సిద్ధరాంపురం రోడ్డు వరకూ శ్రమదానం చేసి గుంతలు పూడ్చారు. అనంతరం కార్మికులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఓ.నల్లప్ప మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య భూస్వామి కుటుంబంలో పుట్టినప్పటికీ కష్టజీవుల రాజ్యం రావాలని.. దున్నేవారికి భూమి.. పేదలందరికీ కూడు, గుడ్డ, నీడ అందాలని అనేక ఉద్యమాలు నడిపారన్నారు. కష్టజీవుల సమస్యలపై అటు పార్లమెంటు, అసెంబ్లీలో గళమెత్తారన్నారు. 1964లో సిపిఎంగా ఏర్పడి జాతీయ ప్రథమ ప్రధాన కార్యదర్శిగా పార్లమెంటులో ప్రతిపక్ష నాయకుడిగా పని చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి ఆర్.కుళ్లాయప్ప, మండల నాయకులు వి.శివారెడ్డి, డి.శ్రీనివాసులు, సి.నాగేంద్ర, పుల్లయ్య, నెట్టికంటయ్య, ఎర్ర కొండప్ప, వెంకట కొండ, సుబ్రమణ్యం, నాగరాజు, చెన్నప్ప, నాగలింగమయ్య, మహమ్మద్ రఫీ, నడిపక్క, వెంకట్ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

శ్రమదానం చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి
www.prajasakti.com

చిరస్మరణీయుడు పుచ్చలపల్లి సుందరయ్య

వర్ధంతి కార్యక్రమాల్లో వక్తలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

స్వాతంత్య్ర సమరయోధులు, పేదల పక్షపాతి, విప్లవకారుడు కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య చిరస్మరణీయుడు అని పలువురు వక్తలు కొనియాడారు. కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతిని జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పలుకాలనీలు, ప్రజాసంఘాల కార్యాలయాలు, కూడళ్లలో సుందరయ్య ఫొటోలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా అనంతపురంలో నిర్వహించిన కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి రామిరెడ్డి మాట్లాడుతూ దేశంలో అత్యంత ఆదర్శవంతమైన నాయకుల్లో అగ్రగామిగా సుందరయ్య ఉంటాడన్నారు. రాజకీయ విభేదాలతో నిమిత్తం లేకుండా ఆయన్ను అభిమానించేవారు చాలా మంది ఉన్నారన్నారు. దేశ చరిత్రలోనే ఇలాంటి అరుదైన నాయకులు బహు కొద్ది మంది మాత్రమే ఉంటారని, వారిలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య ఒకరన్నారు. చిన్నతనంలోనే స్వాతంత్య్ర పోరాటంలో పాల్గొని బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాడినారని తెలిపారు. నిజాం నవాబు పాలనకు వ్యతిరేకంగా పేద రైతులను వ్యవసాయ కార్మికులను కలుపుకుని తెలంగాణ సాయుధ పోరాటాన్ని నడిపి వేల ఎకరాలను పేదలకు పంచడం సుందరయ్యకు మాత్రమే సాధ్యమైనదని తెలిపారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చిన తర్వాత మొదటి పార్లమెంట్లో ప్రతిపక్ష నాయకుడిగా ప్రజా సమస్యలను పార్లమెంటులో ప్రస్తావించిన వారిని ఇప్పటికీ సుందరయ్య పేరును చెప్పుకుంటున్నారని తెలిపారు. అందుకే సుందరయ్య మరణించి 40ఏళ్లు అవుతున్నా చిరస్మరణీయునిగా ప్రజా మనసుల్లో ఉన్నాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నాగేంద్రకుమార్, జిల్లా కమిటీ సభ్యులు వెంకటనారాయణ, నగర కార్యదర్శివర్గ సభ్యులు వలి, మహమ్ద్ ఇర్ఫాన్, నగర కమిటీ సభ్యులు ఎర్రిస్వామి, లక్ష్మీనారాయణ, ఎఐవి నాగరాజు, లక్ష్మీనరసమ్మ, ఎన్టీఆర్ సీనా, అశ్విని, గఫూర్, జెవివి నాయకులు తిరుపాలు, ఉపాధ్యాయులు గోవిందరాజులు, రమణయ్య, కోటేశ్వరప్ప, డేవిడ్, రాము, ఆది, శంషాద్, హాజీవలి, శంకర్, సిద్దు, ఇజ్రాయిల్, తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు : కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకుని సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి మారుతీప్రసాద్ మాట్లాడుతూ స్వాతంత్య్ర పోరాట యోధులుగా, పార్లమెంట్లో తొలి ప్రతిపక్ష నాయకుడిగా, దక్షిణ భారత కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ నిర్మాతగా పుచ్చలపల్లి సుందరయ్య చేసిన సేవలు మరువలేనివన్నారు. అంతేగాకుండా వారసత్వంగా వచ్చిన ఆస్తిని పార్టీకి ఇచ్చిన త్యాగధనుడు అని కొనియాడారు. ఆయన ఆశయాలను కొనసాగిద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు సాకే నాగరాజు, సురేంద్ర, నాయకులు డి.శ్రీనివాసులు, ఉష్ణీష, తిమ్మప్ప, ఎస్‌కెం బాషా, చంద్రశేఖర్, ఓబులేసు, షాషా, అబ్బుల్ల, సూరి, రాముడునాయక్, షబ్బీర్, జయమ్మ, ఖాదర్, ఈరన్న, సుగుణ, షకీరా, సరస్వతి, కిష్టప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : స్వాతంత్య్ర సమరయోధులు, పేదల పక్షపాతి, విప్లవకారుడు కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలోని సిపిఎం స్థూపం వద్ద చిత్రపటానికి పూలమాల వేసి నివాళి లర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యురాలు సావిత్రమ్మ, మండల కార్యదర్శి శివశంకర్ మాట్లాడుతూ సుందరయ్య చిన్నతనం నుంచే బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా.. వ్యవసాయ కూలీల హక్కుల సాధన, కుల వివక్ష, అంటరానితనానికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేశారన్నారు. ప్రతిఒక్కరూ ఆయన అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పిఆర్‌డి జిల్లా కార్యదర్శి రామయ్య, రైతుసంఘం మండల కార్యదర్శి రాము, ఆవాజ్ మండల కార్యదర్శి వలి, అంగన్వాడీ యూనియన్ మండల కార్యదర్శి రామదేవి, సత్యసాయి నాయకులు శ్రీరాములు, వెంకటమ్మ, ఐద్వా మండల కార్యదర్శి రాజేశ్వరమ్మ, మధ్యాహ్న భోజనం జిల్లా సహాయ కార్యదర్శి జయమ్మ, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

పుట్లూరు : వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.సూరి ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని నారాయణరెడ్డిపల్లి, కడవకల్లులో చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కూలీలకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి పెద్దయ్య, నాయకులు ఆదినారాయణ, భాస్కర్‌రెడ్డి, జె.పెద్దయ్య, రామాంజులరెడ్డి, సుబ్బరాయుడు, ఉపాధి కూలీలు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు : మండలంలోని అమలదిన్నె గ్రామంలో సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి తాడిపత్రి బాధ్యులు జగన్ హాజరై అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో మండల, గ్రామ కమిటీ సభ్యులు, కూలీలు పాల్గొన్నారు.

శింగనమల : కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇందులో భాగంగా మండల పరిధిలోని ఆనందరావుపేట గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో కూలీలకు ఉపాధి హామీ పనులు కల్పించి వలసలను నివారించాలన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న 12 వారాల బిల్లులను కూలీల ఖాతాలకు జమ చేయాలని, పనిముట్లు, మెడికల్ కిట్లను అందుబాటులో ఉంచాలని, సంవత్సరంలో 200 రోజులు పని దినాలు కల్పిస్తూ రోజుకు రూ.600 వేతనం చెల్లించాలని కోరారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ సాకే బ్రహ్మయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుంకన్న, రామాంజనేయులు, లక్ష్మీనారాయణ, కేశన్న, మునెప్ప, కుళ్లాయప్ప, దాదాపు 100 మంది కూలీలు పాల్గొన్నారు.

ఉరవకొండ : పుచ్చలపల్లి సుందరయ్య జీవితాన్ని నేటి యువతతోపాటు సమాజంలో ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.కృష్ణమూర్తి, ఎం.బాలరంగయ్య పిలుపునిచ్చారు. సుందరయ్య వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలోని సిపిఎం కార్యాలయంతోపాటు మోపిడి, ఇంద్రావతి, చిన్నముష్టూరు, పెద్దముష్టూరు గ్రామాలు, కూడేరు మండల కేంద్రంలోని కార్యాలయంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య నెల్లూరు జిల్లా అలగానిపాడు గ్రామంలో 1917లో జన్మించి 1985లో మరణించారన్నారు. సుందరయ్య విద్యార్థి దశ నుంచి విద్యార్థుల సమస్యల పట్ల అప్పటి బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎన్నో ఆందోళనలు, పోరాటాలు చేశారన్నారు. తన సొంత గ్రామంలో తన ఇంటి నుండే కూలి పోరాటాలు నిర్మించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. అలాంటి ఆయన ఆశయాలను లక్ష్యాలుగా చేసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి రంగారెడ్డి, కౌలు రైతుసంఘం జిల్లా నాయకులు పెద్దముష్టూరు వెంకటేశులు, మండల కమిటీ సభ్యులు మురళి, వీరాంజనేయులు, జ్ఞానమూర్తి, సిద్ధప్ప, సుంకన్న, కోనంకి రాముడు, ప్రజాసంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురంలో సుందరయ్యకు నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు, చిన్నారులు

విడపనకల్లో సిపిఎం ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి ఎ.రంగారెడ్డి, హమాలీ నారాయణ, ఎర్రిస్వామి, శంకరయ్య, లింగన్న, ఈశ్వర్, బాలాజీ, యోసేపు, తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడు : రాప్తాడు మండల కేంద్రంలోని పంగల్ రోడ్డులో సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళుర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులకు రామాంజనేయులు, రాప్తాడు రూరల్ ప్రాంతీయ కమిటీ సభ్యులు పోతులయ్య, నాయకులు బ్రహ్మయ్య, సుబ్బారావు, సుబ్బిరెడ్డి, లక్ష్మన్న, మల్లేష్, ప్రకాష్, ప్రతాప్, హమాలీలు, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య జీవితం నేటి యువతరానికి ఎంతో ఆదర్శప్రాయమని ఆ పార్టీ సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.మల్లికార్జున తెలిపారు. సుందరయ్య 40వ వర్ధంతి సందర్భంగా సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సుందరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు మధు, నాగరాజు, తిమ్మరాజు, శంకర్, రమేష్, కృష్ణానాయక్, తిప్పేస్వామి, నాగ, ఆంజనేయులు ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ కార్యదర్శి వంశీకృష్ణ, రాము, భరత్ పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్ : పట్టణంలోని శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం పంప్ హౌస్ వద్ద కార్మికులు చేపట్టిన సమ్మె 44వ రోజుకు చేరుకుంది. కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా దీక్షా శిబిరంలో సోమవారం సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు, జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్‌ప్రసాద్ సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఓబులు మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య పోరాటమే స్ఫూర్తిగా సమాజంలో అంటరానితనం నిర్మూలనకు విశేష కృషి చేశారన్నారు. సామాజిక అసమానతలు సరికాదని ప్రజల్లో చైతన్యం తెచ్చారన్నారు. తను నమ్మిన సిద్ధాంతంతో తుదిశ్వాస వరకూ కమ్యూనిస్టు పార్టీలో కొనసాగి కార్మికుల సమస్యలపై నిరంతరం ఆందోళనలు చేశారన్నారు. అలాగే శ్రీరామిరెడ్డి తాగునీటి కార్మికులకు వేతన బకాయిలు, పిఎఫ్ చెల్లించేంత వరకూ సమ్మె కొనసాగిస్తామని తెలిపారు.కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్ ప్రసాద్, మండల అధ్యక్షుడు రంగనాథ్, శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా పథకం యూనియన్ జిల్లా కోశాధికారి వన్నూరుస్వామి, నాయకులు రమేష్, హనుమంతరెడ్డి, నాగరాజు, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనహాల్ : స్థానిక ఎంపిడిఓ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుంద రయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. సిఐటియు నాయకులు మాట్లాడుతూ నిరంతరం పేదల పక్షపాతిగా, పేదల సమస్యలే తన సమస్యలుగా ప్రభుత్వాలను నిలదీసి ప్రజలకు సేవలందించిన మహనీయులు సుందరయ్య అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఓబులేసు, శ్రీనివాసులు, వన్నూరుస్వామి, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : స్థానిక సిపిఎం కార్యాలయంలో సిపిఎం సీనియర్ నాయకుడు ఆర్.ముత్యాలు అధ్యక్షతన కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళుర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకుడు అనిమిరెడ్డి, మండల కార్యదర్శి మల్లేష్, శంకర, ఈశ్వరయ్య, నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురంలో సుందరయ్యకు నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు, చిన్నారులు

కళ్యాణదుర్గంలో నివాళులర్పిస్తున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు, కార్మికులు

అధికార పార్టీ వైపు మొగ్గు

కదిరి మున్సిపాలిటీ, గాండ్లపెంట ఎంపిపి అధికార ఖాతాలో.. కోరం లేక రామగిరి ఎంపిపి ఎన్నిక వాయిదా

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

గత కొన్ని నెలలు అధికార మార్పిడి అధికార పార్టీ చేపట్టిన ప్రయత్నాలు కదిరిలో ఫలించాయి. రామగిరి మండల పరిషత్ మాత్రం ఇప్పటికీ ఎవరి పక్షాన చేరలేదు. ఈసారి అక్కడ వాయిదా పర్వం తప్పలేదు. సత్యసాయి జిల్లాలో స్థానిక సంస్థల అధికార మార్పిడి వ్యవహారం గత కొన్ని రోజులుగా రాజకీయ వేడిని రాజేస్తూ వచ్చాయి. స్థానిక సంస్థ ఎన్నికల్లో అప్పటి అధికార వైసిపి అత్యధిక స్థానాల్లో గెలుపొంది అన్ని స్థానిక సంస్థల్లోనూ పాగా వేసింది. అవిశ్వాసానికి నాలుగేళ్ల సమయం పూర్తవడంతోపాటు ఇప్పుడు అధికారంలో టిడిపి వచ్చింది. టిడిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి స్థానిక సంస్థలను ఏదో రకంగా చెజెక్కించుకునే ప్రయత్నాలు చేసింది. ఇందులో ఇప్పటికే హిందూపురం పురపాలక సంఘాన్ని దక్కించుకుంది. మెజార్టీ వైసిపి కౌన్సిలర్లు టిడిపిలో చేరడంతో మున్సిపాల్టీని టిడిపి దక్కించుకున్నట్టయింది. కదిరి మున్సిపాలిటీ మాత్రం మూడుసార్లకుపైగా వాయిదా పడుతూ వచ్చింది. కదిరి మున్సిపాలిటీలో 36 మంది కౌన్సిలర్లు ఉంటే అత్యధిక మంది వైసిపి వారే ఉండటంతో ఛైర్మన్‌గా ఉంటూ వచ్చారు. అవిశ్వాస సమయం రావడంతో ముందున్న ఛైర్మన్‌ను దించి కొత్తగా మరొకరవ్వాలన్న యోచనతో పాలకవర్గంలో చీలికలొచ్చాయి. ఈ చీలికలను అధికార పార్టీ తమకు అనుకూలంగా మార్చుకునేందుకు పలుదఫాలు ప్రయత్నించి విఫలమైంది. ఎట్టకేలకు ఈసారి 25 మందిని తమ వైపు తిప్పుకుని పాలకవర్గ మార్పులో తమ మార్కును వేసుకునే విషయంలో విజయవంతమైంది. 11 మంది కౌన్సిలర్లు వైసిపి వైపే ఉండిపోయారు. మెజార్టీ టిడిపి వైపు రావడంతో వారనకున్న ఛైర్మన్ అభ్యర్థి దిల్‌షాద్‌దున్నిసాను చేశారు. వైస్ ఛైర్మన్లుగా రాజశేఖర్ ఆచారి, సుధారాణిలను చేశారు. ఇదే తరహాలో గాండ్లపెంట ఎంపిపి స్థానాన్ని గుజ్జల సోమశేఖర్‌రెడ్డిని చేశారు. ఈ జిల్లాలో చాలాకాలం రసవత్తరంగా సాగుతూ వచ్చిన రామగిరి మండల పరిషత్ అధ్యక్ష ఎన్నిక మాత్రం జరగలేదు. దీన్ని ఎలాగైనా తమ ఖాతాలో వేసుకోవాలని అధికార టిడిపి అనేక రోజులుగా ప్రయత్నాలు చేస్తూనే ఉంది. ఉన్న తొమ్మిది మందిలో ఐదు మందిని తమ వైపు తిప్పుకుంటే అధికార మార్పిడి జరుగుతుంది. అయితే అది సాధ్యపడటం లేదు. ఈ ఎన్నికలకు కొన్ని రోజులు ముందుగా ఎంపిటిసిలు టిడిపి కండువాలు కప్పుకుని కనిపించారు. దీంతో ఈసారి రామగిరి ఎంపిపి దక్కించుకుంటుందని భావించారు. మరుసటి రోజే వైసిపి అప్రమత్తమై కండువాలు కప్పుకున్న వారిని తిరిగి తమ వైపు తీసుకెళ్లారు. దీంతో మెజార్టీ బలం అధికార టడిపికి కొరవడింది. వైసిపి ఎంపిటిసిలెవరు ఈ ఎన్నికకు హాజరవలేదు. కోరం లేకపోవడంతో ఈసారీ మండల పరిషత్ అధ్యక్ష ఎన్నిక జరగకుండానే వాయిదా పడింది. ఇలా రామగిరి ఎంపిపి స్థానం మాత్రం సాధారణ ఎన్నికకు మించి రసవత్తరంగా మారుతోంది. అధికార టిడిపి, ప్రతిపక్ష వైసిపి మధ్య పోటీపోటాగా రాజకీయ ఎత్తులు సాగుతున్నాయి. ఇది ఎప్పటి తేలనుందన్నది ఆసక్తికరంగా మారింది.

పుట్లూరు ట్రాన్స్‌కో ఎఇగా సుదర్శన్‌రెడ్డి

పుట్లూరు : పుట్లూరు మండల ట్రాన్స్‌కో ఎఇగా సుదర్శన్‌రెడ్డి సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎఇగా బాధ్యతలు నిర్వహిస్తున్న బాషా నెల్లూరుకు బదిలీ కావడంతో యాడికిలో విధులు నిర్వహిస్తున్న సుదర్శన్‌రెడ్డి ఇక్కడికి వచ్చి బాధ్యతలు చేపట్టారు.

పెన్నోబిలేసుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే అమిలినేని

పూజలు చేస్తున్న అమిలినేని కుటుంబ సభ్యులు

ఉరవకొండ : మండల పరిధిలోని పెన్నోబిలంలో వెలిసిన లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కుటుంబ సమేతంగా సోమవారం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.రమేష్‌బాబు, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

21న మినీ మహానాడు

పుట్లూరు : ఈనెల 21న సింగనమల నియోజకవర్గం సంబంధించి గార్లదిన్నె మండలంలో మినీ మహానాడు నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ బాల రంగయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలం లోని టిడిపి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని విజయవంతం చేయాలని టిడిపి నాయకులకు కార్యకర్తలకు సూచించారు.

నేడు అనంతపురంలో..

అనంతపురం కలెక్టరేట్ : టిడిపి ఆధ్వర్యంలో నేడు అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో మినీ మహానాడు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. సోమవారం నగరంలోని రామ్‌నగర్‌లో ఉన్న కమ్మభవన్‌లో ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. ఉదయం 10.30 గంటలకు మినీ మహానాడు ప్రారంభం అవుతుందన్నారు.

భూసార పరీక్షలపై శిక్షణ

అనంతపురం: అనంతపురంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో రసాయన శాస్త్ర విద్యార్థులకు సోమవారం భూసార పరీక్షలు చేసే విధానంపై శిక్షణ ఇచ్చారు. ఏరిస్ ఆగ్రో కెమికల్స్ కంపెనీ, కళాశాల రసాయన శాస్త్ర విభాగం మధ్య కుదిరిన అవగాహన ఒప్పందం మేరకు ఏరీస్ ఆగ్రో కెమికల్స్ అసిస్టెంట్ జోనల్ మేనేజర్ శ్రీనివాసులునాయుడు ఆధ్వర్యంలో కంపెనీ ఎక్సటెన్షన్, డెవలప్‌మెంట్ ఆఫీసర్ పి.రామచంద్ర భూసార పరీక్షలు చేయడంపై విద్యార్థులకు తర్ఫీదును ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మశ్రీ, రసాయన శాస్త్ర లెక్చరర్లు టి.జితేంద్ర, బి.నర్సింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పొలం రస్తా సమస్య పరిష్కరించాలని వినతి

తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతుసంఘం నాయకులు, రైతులు

తాడిపత్రి రూరల్ : మండల పరిధిలోని గంగాదేవిపల్లి గ్రామంలో నెలకొన్న పొలం రాస్తా సమస్యను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం మండల కార్యదర్శి రాజారామిరెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం స్థానిక కార్యాలయంలో తహశీల్దార్ రజాక్‌వలికి రైతుసంఘం ఆధ్వర్యంలో రైతులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వేనెంబర్ 206 నుంచి తమ పొలాలకు వెళ్లేందుకు వెళ్తున్న దారిని కొందరు అడ్డగిస్తున్నారన్నారు. సమస్యపై అనేకమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఇందుకు స్పందించిన తహశీల్దార్ సాయంత్రానికి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వినతిపత్రం అందజేసిన వారిలో రైతులు నరసింహారెడ్డి, రమేష్, శివ, శంకర్, ప్రతాప్, లక్ష్మీనారాయణ, గంగన్న, అమర్నాథ్, తదితరులు ఉన్నారు.

దళిత విద్యార్థిపై దాడి శోచనీయం

ఉరవకొండ : తిరుపతిలో ఇంజినీరింగ్ దళిత విద్యార్థి జేమ్స్‌పై దాడి శోచనీయమని వజ్రకరూరు మండలం చాబాల సర్పంచు, వైసిపి నాయకులు మల్లెల జగదీష్ సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు. రాష్ట్రంలో దిగజారిపోయిన శాంతి భద్రతలు, దళితులపై దాడులు తీవ్రమయ్యాయని నిరూపించేందుకు ఇదొక ఘటన ఉదాహరణ అన్నారు. తమ గొంతు గట్టిగా వినిపించలేని వర్గాల వారికి రాష్ట్రంలో రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారపార్టీ నాయకుల డైరెక్షన్‌లో కక్షసాధింపు చర్యల్లో పోలీసు యంత్రాంగం మునిగి తేలుతోందని విమర్శించారు. జేమ్స్‌పై దాడి ఘటనలో పోలీసు యంత్రాంగం వైఫల్యమే కాదు, రాజకీయ జోక్యంతో కనీసం ఫిర్యాదు కూడా స్వీకరించలేని పరిస్థితి ఉందన్నారు. ఈ దాడికి కారకులైన అగ్రకుల విద్యార్థులు, రౌడీషీటర్లను కఠినంగా శిక్షించాలని, లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

ఆర్డీటీని కాపాడాలని నార్పలలో భారీ ర్యాలీ

ప్రజాశక్తి-నార్పల

ర్యాలీ నిర్వహిస్తున్న సేవ్ ఆర్డీటీ కమిటీ సభ్యులు, నాయకులు

ఆర్డీటీని కాపాడుకుందా మని సేవ్ ఆర్డీటీ ఎసి మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుంచి ప్రారంభమైన ర్యాలీ తహశీల్దార్ కార్యాలయం వరకూ సాగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఆర్డీటీ సంస్థ జిల్లాలోని గ్రామాల్లో పిల్లల చదువులు, వైద్యం, ఇళ్ల, బడి, వ్యవసాయంతోపాటు పలు రంగాల్లో అనేక సేవలు చేస్తోందన్నారు. అలాంటి సంస్థకు కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సిఆర్ఎను రెన్యువల్ చేయకపోవడంతో సంస్థ మనుగడకే ప్రమాదం పొంచి ఉందన్నారు. ఆర్డీటీ సేవలు కొనసాగాలంటే తప్పనిసరిగా ఎఫ్‌సిఆర్ఎను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ ఛైర్‌పర్సన్ వేదాంతం నాగరత్నమ్మ, సేవ్ ఆర్‌డిటి జెఎసి కన్వీనర్ దుర్గం రామాంజనేయులు, కో కన్వీనర్ రంగాపురం పుల్లప్ప, కమిటీ సభ్యులు శివయ్య, సుధాకర్, గంగాధర్, సూర్యనారాయణ, ఎర్రన్న, మాజీ ఎంపిటిసి వేణుగోపాల్, సాకే ఆంజనేయులు, ప్రభుదాస్, వెంకటేష్, తుంపెర శివయ్య, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

అనంతరాముడుకు తెలుగువన్ స్ఫూర్తి పురస్కారం

ప్రజాశక్తి-అనంతపురం

పురస్కారం అందుకుంటున్న అనంతరాముడు

డిజిటల్ మీడియా రంగంలో తనకంటూ ఒక ప్రత్యేకతను సంతరించుకున్న తెలుగువన్ సంస్థ 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అనంతలక్ష్మి గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ ఛైర్మన్ అనంత రాముడు స్ఫూర్తి పురస్కారాన్ని అందుకున్నారు. సామాజిక స్పృహ కలిగి అనుక్షణం ప్రజా సంక్షేమానికి పరితపిస్తూ.. వారు ఎంచుకున్న రంగాల్లో విశేషమైన సేవలు అందించిన వారికి హైదరాబాద్‌లో తెలుగువన్ స్ఫూర్తి పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలో పండ్లతోటల సంఘం అధ్యక్షులుగా ముళ్లగూరు అనంతరాముడు వ్యవసాయ రంగంలో కనబరచిన విశేషమైన సేవలను గుర్తించి సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమణ, త్రిదండి చిన్న జియర్‌స్వామి, రఘురామ కృష్ణంరాజు, తదితరులు పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అవార్డును అందుకున్న అనంతరాముడుకు అనంతలక్ష్మి ఇన్స్టిట్యూషన్స్ వైస్‌ఛైర్మన్ ముళ్లగూరు రమేష్‌నాయుడు, అధ్యాపక, అధ్యాపకేతర బృందాలు అభినందనలు తెలిపారు.

ఎడిసిసిబి ఛైర్మన్‌ను కలిసిన టిడిపి నాయకులు


కేశవరెడ్డిని సన్మానిస్తున్న టిడిపి నాయకులు

శింగనమల : ఉమ్మడి అనంతపురం జిల్లా ఎడిసిసి బ్యాంకు ఛైర్మన్‌గా నియమితులైన ముంటిమడుగు కేశవరెడ్డిని మండల టిడిపి నాయకులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువా కప్పి పుష్పగుచ్ఛం ందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మాజీ జడ్పిటిసి అమ్మలదిన్నె శాలిని, మాజీ మండల కన్వీనర్ చితంబరిదొర, నాయకులు సుధీర్‌రెడ్డి, ఏకిల ఆదినారాయణ, తదితరులు, పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్ నాయకులకు సన్మానం

ఉరవకొండ : ఎపి ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్ ఉరవకొండ తాలూకా అధ్యక్షులుగా ఎన్నికైన వజ్రకరూరు మండల విద్యాశాఖ అధికారి చాపిరి ఎర్రిస్వామి, ట్రెజరర్ ఉరవకొండ మండల వ్యవసాయ విస్తరణ సహాయ అధికారి భరత్‌రాజును దళిత సంఘాలు విద్యార్థి సంఘాల నాయకులు ఆదివారం మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గోపీకృష్ణ, చాబాల సర్పంచు జగదీష్, ఎంఇఎఫ్ నాయకులు మీనుగ భాస్కర్, సాకే భాస్కర్, దుర్గాప్రసాద్, లాలుప్రసాద్, సీఎం గోవిందు, ఆనంద్‌రాజు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సంఘం నాయకులు మధుప్రసాద్, రాము, దళిత నాయకులు ఉరవకొండ గోపాల్, మీనుగ రామాంజినేయులు, లత్తవరం చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభతోనే ఏదైనా సాధిస్తాం

ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, విప్ కాలవ

ప్రజాశక్తి అనంతపురం కలెక్టరేట్

విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తున్న ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, విప్ కాలవ

విద్యాభ్యాసంలో పోటీ నెలకొన్న ప్రస్తుత సమాజంలో ప్రతిభ ఆధారంగానే విద్యార్థులు అనుకున్నది సాధిస్తారని ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. సోమవారం నగరంలోని వాల్మీకి కళ్యాణ మండపంలో వాల్మీకి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో వాల్మీకి విద్యార్థులకు ప్రతిభ పురస్కారాల ప్రధానోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో అత్యుత్తమమైన శిఖరాలను అధిరోహించాలంటే ప్రతిభ తోనే సాధ్యమవుతుందన్నారు. నేటి తరం విద్యార్థులందరూ సిద్ధమై బాగా చదివి తల్లి తండ్రుల ఆశయాలు నెరవేర్చాలన్నారు. రాబోవు రోజుల్లో ఉత్తమ స్థానాలు అధిరోహించి సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు. ఇక్కడున్న ప్రతి విద్యార్థి ఎంతగానో గర్వించదగిన వారని ఇలా ప్రోత్సహించడం తమకు ఆనందంగా ఉందన్నారు. అత్యుతమ మార్కులు సాధించి ఒకరిని మించి మరొకరు పోటా పోటీగా చదివి ఉత్తమ ప్రతిభ కనబరిచిన వాల్మీకి విద్యార్థులందరూ సమాజాభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కర్ణాటక రాష్ట్రం ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సురేంద్ర, వాల్మీకి ఉద్యోగుల సంఘం అనంతపురం జిల్లా అధ్యక్షులు అక్కులప్ప, కార్యదర్శి చైతన్యకుమార్, జిల్లా కోశాధికారి రవికుమార్, నాయకులు గోపాల్, ఈశ్వరయ్య, వెంకట రాముడు, అనిల్‌కుమార్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లండి

ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్, టిడిపి జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్

ప్రజాశక్తి-గుంతకల్లు

మినీ మహానాడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన 11నెలలోనే రాష్ట్రంలో చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్, టిడిపి జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని బలిజ కళ్యాణ మండపంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్ అధ్యక్షతన మినీ మహానాడు కార్యక్రమం నిర్వహినంచారు. ముందుగా పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం సభా వేదికపై టిడిపి వ్యవస్థాపకులు నందమూరు తారకరామారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నందమూరి తారకరామారావు టిడిపిని స్థాపించి బడుగు బలహీన వర్గాల ప్రజలకు రాజకీయం నేర్పించారన్నారు. సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత కూడా ఆయనకే దక్కుతుందన్నారు. ఆయన అడుగుజాడల్లోనే ప్రస్తుత సిఎం చంద్రబాబు పార్టీని నిడిపిస్తూ బడుగు,బలహీన వర్గాలకు రాజకీయంగా పెద్దపీట వేస్తున్నారన్నారు. గత వైసిపి పాలనలో అన్ని వ్యవస్థలను జగన్మోహన్‌రెడ్డి నిర్వీర్యం చేశారన్నారు. సంక్షేమ పథకాల నిధులను పక్కదారి పట్టించి ప్రజలను మోసం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి 11 నెలల్లోనే రాష్ట్రంలో అభివద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నా రు. అదే తరహాలోనే ప్రజలకిచ్చిన హామీలను సిఎం చంద్రబాబు నాయుడు నెరవేరుస్తున్నారన్నారు. హంద్రీనీవా కాలువను వెడల్పు చేసి జిల్లాలోని రైతులకు సాగు నీరు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. వచ్చేనెలలో తల్లికి వందనం, ఆగస్టులో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి హామీలను అమలు చేయనున్నట్లు వివరించారు. జిల్లాలో పరిశ్రమలు స్థాపించి నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం ఉందన్నారు. కాగా ఈనెల 20న జిల్లాలో మినీ మహానాడు ఉంటుందన్నారు. 27, 28, 29వతేదీల్లో కడపలో మహానాడు ఉంటుందని ఆయా కార్యక్రమాలకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గుమ్మనూరు నారాయణస్వామి, గుమ్మనూరు శ్రీనివాసులు, డాక్టర్స్ సెల్ జిల్లా అధ్యక్షురాలు పత్తి హిమబిందు, తదితరులు పాల్గొన్నారు.

'అనంత'ను కలిసిన పంచాయతీ రాజ్ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు

అనంత వెంకటరామిరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

అనంతపురం : వైసిపి పంచాయతీ రాజ్ విభాగం జిల్లా ఉపాధ్యక్షులుగా నియమితులైన వెంకటలక్ష్మిపతి రాయదుర్గం నియోజకవర్గ నాయకులతో కలిసి ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డిని ఆదివారం అనంతపురంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అనంత మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి హామీలను గాలికొదిలేసి అక్రమ కేసులతో కక్షపూరిత ధోరణితో వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. పార్టీ నాయకులను సమన్వయం చేసుకుని కూటమి నేతలు చేస్తున్న అరాచక పాలనను ప్రజల్లోకి తీసుకెళ్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.